ఆదివారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 34.0°C | కనిష్టం : 23.5°C



రంజాన్ వేళలు
ఇఫ్తార్ : సోమవారం సా : 6.32 గం..
సహర్ : మంగళవారం ఉ : 5.00 గం..



ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిల్వ ఉంచిన డబల్‌కా మీఠా



రసాయన రంగులు కలిపిన, అపరిశుభ్రంగా ఉన్న చికెన్

కంచంలో.. కల్తీ..!

- రంగులతో ఆకట్టుకుంటున్న ఆహారపదార్థాలు
- విచ్చలవిడిగా రసాయనాల వాడకం
- ప్రజల ప్రాణాలతో వ్యాపారుల చెలగాటం
- శుచి.. శుభ్రతను గాలికి వదిలేస్తున్న హోటళ్లు
- అడిగేవారు లేక యథేచ్ఛగా దందా

ఏదో ఒక పనిమీద జిల్లా కేంద్రానికి వచ్చేవారు కాస్త ఆలస్యమైతే కడుపునింపుకోవడం కోసం హోటల్‌కు వెళ్లక తప్పదు. అలాంటివారికి కాస్త శుచి రుచితో కూడిన భోజనం పెట్టాల్సిన నిర్వాహకులు కలుషిత భోజనాన్ని వడ్డించి అడ్డగోలు రోగాలకు ఆజ్యం పోస్తున్నారు. కుళ్లిన ఆహారపదార్థాలనే మళ్లీ మళ్లీ తయారుచేసి కల్తీ దందాకు తెరలేపుతున్నారు. రంగురంగుల రసాయనాలు కలుపుతూ ఆకర్షణీయంగా రకరకాల పేర్లతో వంటలు తయారు చేసి కాసులు మూటగట్టుకుంటున్నారు. ప్రశ్నించేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

లింగాలఘణపురం మార్చి 17: జిల్లా కేంద్రంలోని హోటళ్లలో కడుపారా భోజనం చేయాలంటే ఒకింత ఆలోచించాల్సిందే.. వేలాది మందితో రద్దీగా ఉండే జనగామ.. అడ్డగోలుగా నిర్వహిస్తున్న హోటళ్లు, దాబాలు, కర్రీపాయింట్లు, రెస్టారెంట్లకు అడ్డాగా మారింది. డబ్బు సంపాదనే లక్ష్యంగా పెట్టుకుంటున్న హోటల్ నిర్వాహకులు శుచి శుభ్రతను గాలికొదిలేస్తున్నారు. ఫలితంగా ప్రజల ఆరోగ్యానికి పెనుముప్పు వాటిల్లుతోంది.

లైసెన్స్‌లు లేకుండానే ..

జిల్లా కేంద్రంలో చిన్నా చితక హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు అన్నింటిని కలుపుకుంటే సుమారు 200 దాకా ఉండగా జిల్లాలోని 12 మండలాల పరిధిలో సుమారు 300కి పైగా హోటళ్లు ఉన్నాయి. అయితే వీటిలో 30 శాతం హోటళ్లకు మాత్రమే ఫుడ్‌సేఫ్టీ లైసెన్స్‌లు ఉన్నాయి.

శుచి.. శుభ్రత గాలికి...

తాగునీటి నుంచి తినే ఆహారం దాకా ఎక్కడ కూడా శుభ్రతను పాటించడం లేదని జిల్లా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వెయిటర్లు జాగ్రత్తలు పాటించకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తలకు క్యాప్, మూతికి మాస్క్, చేతులకు గ్లౌజ్‌లు ధరించకుండా తినుబండారాలు వడ్డిస్తున్న పట్టించుకునే దిక్కులేదని జిల్లా ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది వెయిటర్లు, మాస్టార్లు పాన్‌పరాగ్‌లు నములుతూ వంటలు చేయడం ఇక్కడ సర్వసాధారణమే..



అపరిశుభ్రంగా ఉన్నగ్రైండర్లు

మురుగుకాల్వల పక్కనే తినుబండారాలు..

జిల్లాలో వైన్స్‌షాపుల వద్ద డ్రైనేజీల పక్కనే జాగ్రత్తలు పాటించకుండా ఆహారపదార్థాలను విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా కేఫ్‌ల పేరిట జనగామలో విచ్చలవిడిగా వెలిసిన టీ విక్రయ కేంద్రాల్లో తయారుచేసే సమోసాలు, మిఠాయిలు, ఇతర ఆహారపదార్థాలపై ఈగలు దోమలు, ఇతర క్రిమికీటకాలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవడంలేదు.

కలర్‌ఫుల్ కెమికల్ పూతలు..

ప్రమాదకర రసాయనాలు లెడ్ క్రోమేట్, సింథటిక్ కలర్, మెటానిల్ ఎల్లో, టెట్రాజిన్, సూడాన్, ఆహారంలో ఆకర్షణీయమైన గులాబీ రంగు వచ్చేందుకు వాడే రోడామిన్ వంటి రంగులను ఆహారపదార్థాలతో మిశ్రమం చేస్తుండటం బహిరంగ రహస్యమే. వీటితో ప్రమాదకరమైన కేన్సర్, లివర్, గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాడలేని తనిఖీలు...

జిల్లా కేంద్రంలో అట్టహాసంగా కనిపిస్తున్న హోటళ్ల మాటున అక్రమ కల్తీ దందా జోరుగా కొనసాగుతోంది. హోటళ్లలో పనిచేసే కూలీలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం, వంటకాల తయారీలో కల్తీ ఆహార వస్తువులు వినియోగించడం లాంటి అక్రమాలు షరామామూలైపోతున్నాయి.. నాలుగేళ్ల క్రితం జనగామ జిల్లా కోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సత్యనారాయణ ఆకస్మాత్తుగా హోటళ్లను తనిఖీ చేసి ఆహారకల్తీ వ్యవహారాన్ని బట్టబయలు చేశారు. దీంతో వెంటనే రంగంలోకి దిగిన అప్పటి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి స్వయంగా తనిఖీలు చేపట్టడంతో కుళ్లిన మాంసాహారం, ఫ్రీజర్లలో నిల్వ ఉంచిన మాంసం, రసాయనాలు కలిపిన ఆహారపదార్థాలు గుర్తించారు. వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులను పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించాల్సిందిగా ఆదేశించారు. దీంతో అప్పట్లో కల్తీ దందా కాస్త పక్కన బెట్టి మళ్లీ షురూ చేశారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల కొరతతో ఇబ్బందులు..

ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్టు-2006 ప్రకారం ప్రతీ 50,000 జనాభాకు ఒక ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండాలి. ఈ లెక్కన జనగామ జిల్లాకు నలుగురు ఫుడ్ సేఫ్టీ అధికారులు ఉండాల్సి ఉండగా వరంగల్, జనగామ జిల్లాలకు కలిపి ఒకేఒక్క అధికారి ఉన్నారు. ఇదే అదనుగా భావిస్తున్న హోటల్ యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు..

కృష్ణమూర్తి, ఇన్‌చార్జి ఫుడ్ ఇన్స్‌పెక్టర్, జనగామ

"ఆహారపదార్థాల నాణ్యతాప్రమాణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూనే ఉన్నాం. కుళ్లిన ఆహార పదార్థాలను, కాలం చెల్లిన వాటిని విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆహారపదార్థాల నాణ్యత విషయంలో జిల్లా ప్రజలకు, హోటల్ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బంది కొరత కారణంగా పని భారం పెరిగిపోతుంది. అయినప్పటికీ ఎక్కడ కూడా తనిఖీల పట్ల నిర్లక్ష్యం చేయడం లేదు."



పక్కాగా ఏర్పాట్లు

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- జిల్లాలో 41 కేంద్రాల్లో నిర్వహణ
- హాజరుకానున్న 6,698 మంది విద్యార్థులు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు

వివరాలు 8లో..

ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాడుతాం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అబ్బాస్



గోపాల్‌నగర్‌లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్

బచ్చన్నపేట, మార్చి 17: పేదలు వేసుకున్న గుడిసెలు తొలగించటం అన్యాయమని, ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు సీపీఎం ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎమ్డీ అబ్బాస్ అన్నారు. ఆదివారం చిన్నరామన్‌చర్ల రెవెన్యూ శివారు గోపాల్‌నగర్ గ్రామ పరిధిలోని 174 సర్వేనంబర్‌లో వేసిన గుడిసెల స్థలంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించారని, సీపీఎం నాయకులను బలవంతంగా అరెస్ట్ చేశారని, ఎన్ని కేసులు పెట్టినా తమ డిమాండ్‌లు సాధించుకునే వరకు పోరు ఆపేదిలేదని అన్నారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమిని పేదలకు ఇచ్చేందుకు ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. కాగా ఉదయం ఎస్‌ఐ సతీష్ అక్కడికి చేరుకుని ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున గుడిసెలు వేయటం లాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్, పర్వతం నర్సింహులు, రామగళ్ల అశోక్, మినలాపురం ఎల్లయ్య తాడెం రాములుతో పాటు వందలాదిగా మహిళలు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని మార్చేందుకు మోదీ కుట్ర

జనగామ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండి.అబ్బాస్ విమర్శించారు. జిల్లాకేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఇర్రి అహల్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని మార్చాలంటే తమకు 400 స్థానాలు కావాలంటూ మోదీ మాట్లాడడం మోదీ, ఆర్‌ఎస్‌ఎస్ రహస్య ఎజెండాలో భాగమేనన్నారు. దేశవ్యాప్తంగా వచ్చే ఎన్నికల్లో బీజేపీని కట్టడి చేసేందుకు సీపీఎం పనిచేస్తుందని, అందులో భాగంగానే భువనగిరి నుంచి పోటీలో నిలవాలని నిర్ణయించామని అన్నారు. బీజేపీ అనుసరిస్తున్న రైతు, కార్మిక, ఉద్యోగ, కర్షక, మహిళా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ ఎన్నికల్లో బీజేపీ గెలుపును అడ్డుకుంటామని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, నాయకులు విజేందర్, నరేందర్, ఉపేందర్, సందీప్, వెంకటమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు 'నాగపురి' గుడ్‌బై!



జనగామ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పార్టీకి ఆ పార్టీ యువ నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గుడ్ బై చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ కుమారుడైన కిరణ్‌కుమార్‌గౌడ్ 2014లో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అంతకుముందు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. బీఆర్‌ఎస్‌లో చేరిన నాటి నుంచి ఆయన సొంతంగా సేవా కార్యక్రమాలు చేస్తూ వచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, మృతిచెందిన వారి కుటుంబాలకు ఆర్థికసాయం చేస్తూ వస్తున్నారు. ఇటీవల జనగామ నుంచి పార్టీ టికెట్‌ను ఆశించి భంగపడ్డారు. దీంతో అప్పటి నుంచి ఆయన పార్టీకి దూరంగా ఉంటున్నారు. కాగా.. తాజాగా ఆయన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు ఆదివారం లేఖ రాశారు.

దశాబ్ధకాలంగా తాను పార్టీకి విధేయుడిగా ఉంటూ పనిచేశానని, అయినప్పటికీ తనను పార్టీ గౌరవించలేదని లేఖలో వాపోయారు. పార్టీలో కొంత మంది నేతలు తనను అణిచివేశారని, బీసీ బిడ్డనైన తనను ఎదగనీయకుండా చేశారని ఆరోపించారు. బీసీ వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఓడిపోయిందని విమర్శించారు. ప్రజల తీర్పును గౌరవించకుండా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతామంటూ చేస్తున్న వ్యాఖ్యలను నిరసిస్తూ తాను బీఆర్‌ఎస్‌ను రాజీనామా చేస్తున్నానని తెలిపారు. కాగా.. త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు.

ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి రద్దు

జనగామ కల్చరల్, మార్చి 17: జిల్లాలో పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ షేక్ రిజ్వాన్ భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు గమనించి ఎన్నికల కోడ్ ముగిసే వరకు ప్రజావాణి కోసం కలెక్టర్ కార్యాలయానికి రావద్దని కోరారు.

చట్టసభల్లో బీసీల వాటా సాధిద్దాం

- ఆలిండియా ఓబీసీ జాక్ నాయకుల పిలుపు



కడవెండిలో దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆలిండియా ఓబీసీ జాక్ నాయకులు

దేవరుప్పుల, మార్చి 17: అమరుల పోరాట స్ఫూర్తితో చట్టసభల్లో బీసీల వాటా సాధించాలని ఆలిండియా ఓబీసీ జాక్ నాయకులు పిలుపునిచ్చారు. 320 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి చేసుకుని ఆదివారం దేవరుప్పుల మండలం కడవెండికి చేరుకున్నారు. అమరులు తెలంగాణ సాయుధ పోరాట యోధులు నల్లా నర్సింహులు స్మారక స్థూపం, తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య విగ్రహం వద్ద వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆలిండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, వైస్ చైర్మన్లు పటేల్ వనజక్క, వెలుగు వనితక్క, హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్దేశ్వర్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ మాట్లాడుతూ చట్ట సభల్లో బీసీల వాటా కోసం ఈనెల 1న మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం మిరిగోన్‌పల్లి వీరుడు సాయన్న గ్రామంలో ప్రారంభమైన బీసీ మహా పాదయాత్ర 17వ రోజుకు చేరుకుందన్నారు. ఆనాటి నిరంకుశ పాలనకు ఎదురొడ్డి పోరాడిన ధీరుల స్ఫూర్తితో చట్టసభల్లో బీసీ వాటా సాధనకోసం జరిగే పోరులో ప్రతీ ఒక్కరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈనెల 20న సాయంత్రం రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలో జరిగే పాదయాత్ర ముగింపు సమావేశానికి వేలాదిగా తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో జరిగిన అన్ని పోరాటాల్లో పాల్గొని త్యాగాలు చేసిన బీసీలు నేడు బీసీ వాటా కోసం జరిగే పోరులో ముందుండాలన్నారు. కార్యక్రమంలో నల్లా నర్సింహులు కూతురు నల్ల అరుణ, దొడ్డి కొమురయ్య వారసుడు దొడ్డి భిక్షపతి, ప్రొఫెసర్ డాక్టర్ చింతం ప్రవీణ్‌కుమార్, ఉద్యమ నాయకులు సోమ రామూర్తి, సూరం నిరంజన్, గోధుమలు కుమారస్వామి, సామాజిక సేవకురాలు దిడ్డి ధనలక్ష్మీ, ముకుంద, నాగమణి, గిరగాని క్రాంతిగౌడ్, ఏటిగడ్డ అరుణ పటేల్, ఎర్ర శ్రీహరి, గిరగాని భిక్షపతి, పర్వత సతీష్, చాపర్తి కుమార్ గాడ్లె, సూరారపు రమాదేవి, కొంగరి నరహరి, సుజాత, బాలస్వామి, విమల, శ్రీనివాస్, రామనర్సయ్య, విశ్వపతి, అజయ్‌పటేల్, విజయ్‌కుమార్, రాంప్రసాద్, ఆంజనేయులు, అరుణ, శ్రావణ్‌కుమార్, సుదర్శన్, సంజీవ, హన్మంతు, మహేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన వైస్ ఎంపీపీ



మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన సుధీర్ రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 17: బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన స్టేషన్ ఘన్‌పూర్ వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమక్షంలో హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో ఆదివారం కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు బాగున్నాయని, కాంగ్రెస్ పార్టీలో చేరితేనే తాటికొండ గ్రామం అభివృద్ధి చెందుతుందనే లక్ష్యంతో చేరానని అన్నారు. రానున్న రోజుల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సింగపురం ఇందిర సహకారంతో తాటికొండ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు.

పదవులపై పెదవి విరుపు



కీలక నేతలకు, సీనియర్లకు దక్కని నామినేటెడ్ పోస్టులు

- మంత్రుల నియోజకవర్గాల్లోని నేతలకు ఝలక్
- వరంగల్ తూర్పు, ములుగు, భూపాలపల్లి నేతలకు నిల్
- ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలోని నేతలకూ నిరాశే..
- ఇక జిల్లా స్థాయి పదవులపైనే ఆశలు



వరంగల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్‌లో నామినేటెడ్ పదవుల పంపకం నేతల్లో అసంతృప్తి రగిలిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కీలకపాత్ర పోషించిన నేతలకు, సీనియర్లకు నామినేటెడ్‌లో గుర్తింపు దక్కలేదనే ఆవేదనలో ఉన్నారు. మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ఎమ్మెల్యేలు లేని అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు ఇవ్వకపోవటంపై కాంగ్రెస్ నేతల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టికెట్ త్యాగం పేరుతో కొందరికే పదవుల ఇచ్చారని, మిగతా వారికి గుర్తింపేదని ఆందోళనలో కొందరు నేతలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 37 నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తే.. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి కేవలం ముగ్గురికి మాత్రమే పదవులు లభించటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఇన్నాళ్లు కాంగ్రెస్ జెండా మోసిన తమకు ఇంకెప్పుడు గుర్తింపని కాంగ్రెస్ నేతల్లో ఆవేదన వ్యక్తమవుతోంది.

ముగ్గురికే పదవులు

కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టింది. పదేళ్ల తరువాత అధికారంలోకి రావటంతో చాలామంది సీనియర్ కాంగ్రెస్ నేతలు, గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్‌లను త్యాగం చేసిన నేతలు, ప్రొటోకాల్ పదవుల కోసం ఎదురుచూస్తున్న నేతలు అనేక మంది వీటిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే గత శనివారం రాత్రి 37మందితో నామినేటెడ్ పదవులను ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి రెండు డజన్లకుపైగా ఆశావాహులు ఉంటే.. కేలవం ముగ్గురికి మాత్రమే పదవులు దక్కాయి. దీంతో చాలామంది నేతల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పరకాల టికెట్ ఆశించి భంగపడిన ఇనుగాల వెంకట్రామిరెడ్డికి కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కూడా) చైర్మన్ పదవి దక్కింది. వరంగల్ పశ్చిమ టికెట్ ఆశించిన జంగా రాఘవరెడ్డికి ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్, గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా పదవి దక్కింది. అలాగే మహబూబాబాద్ ఎంపీ టికెట్ ఆశించిన సీనియర్ నేత బెల్లయ్యానాయక్‌కు గిరిజన కోఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ట్రైకా) చైర్మన్ పదవి దక్కింది. అలాగే మాజీ ఎమ్మెల్యే పోదెం వీరయ్యకు అటవీ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి, అయిత ప్రకాష్‌రెడ్డికి స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. అయితే పోదెం వీరయ్య ములుగు జిల్లా వాసి అయినప్పటికీ భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రికొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. దీంతో పోదెం వీరయ్య పోస్టు ఉమ్మడి ఖమ్మం జిల్లా ఖాతాలోకి వెళుతుందని, అలాగే అయిత ప్రకాష్ రెడ్డి ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంథని నియోజకవర్గం పరిధిలోని మల్హర్ మండలంకు చెందిన నేత. భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పటికీ ఆయనకిచ్చిన పోస్టు

మిగతా 7వ పేజీలో..

గంజాయి మత్తులో యువత

- పొరుగు రాష్ట్రాల నుంచి నగరానికి పెద్దఎత్తున దిగుమతి
- ప్రముఖ విద్యా కేంద్రాల్లో గుట్టుగా విక్రయాలు
- కట్టడి చేయడంలో ఖాకీలు, ఎక్సైజ్ శాఖల నిర్లక్ష్యం

వరంగల్ క్రైం, మార్చి 17: వరంగల్ నగరంలో గంజాయి గుప్పుమంటోంది. పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతున్న గంజాయి ప్రముఖ విద్యా సంస్థలు కేంద్రంగా చేసుకుని విక్రయిస్తునట్లు తెలిసింది. గంజాయి సేవిస్తే ఆరోగ్యం పాడవుతుందని తెలిసి మరీ యువత ఈ మత్తుకు బానిసవుతున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ మత్తును యువత ఆస్వాదిస్తున్నారు. గంజాయికి బానిసలవుతున్నవారిలో సంపన్నుల పిల్లలు ఎక్కువగా ఉంటున్నారు. ఉన్నత విద్యాసంస్థల హాస్టల్స్‌లో ఉండే యువత ఎక్కువగా వినియోగిస్తున్నట్లు అధికారిక సమాచారం. యువతను టార్గెట్ చేసుకుని నగరంలో లక్షల్లో గంజాయి దందా సాగుతోంది. గంజాయి విక్రయాలను కట్టడి చేయడంలో ఖాకీలు వైఫల్యం చెందారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సైజ్ శాఖ అప్రమత్తం కాకుంటే వరంగల్ నగరం మరో పంజాబ్ అయ్యే ప్రమాదం ఉంది.

పొరుగు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున దిగుమతి

పొరుగురాష్ట్రాలైన ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, రాజమండ్రి మీదుగా పెద్దఎత్తున గంజాయి వరంగల్ నగరానికి చేరుకుంటోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రోడ్డు మార్గాన రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిసింది. దీనితో ఈదందా చేసే వారు రైలు మార్గాన్ని ఎంచుకున్నారు. ఒరిస్సా, విశాఖపట్నం నుంచి వచ్చే దళారులు రైలులో గుట్టు చప్పుడు కాకుండా లక్షల్లో గంజాయిని నగరానికి చేర్చుచున్నారు. ఈ వారంరోజుల్లోనే దాదాపు రెండువందల కిలోలకుపైగా గంజాయిని పట్టుకున్నట్లు తెలిసింది. నామమాత్రపు తనిఖీలతోనే ఈ మేరకు పట్టుకుంటే ఇంకా ఏ మేరకు రాష్ట్రానికి చేరుకుంటుందో ఊహించుకోవచ్చు. రాష్ట్రం చేరుకుంటున్న గంజాయి ఇక్కడి నుంచి తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ చేరుచున్నట్లు తెలిసింది.

కాగా గత సంవత్సరం (2023) వరంగల్ నగరంలో పోలీసులు పట్టుకున్న గంజాయి 417 కేజీలు కాగా, దీనివిలువ రూ.1కోటి 4లక్షల 42వేలు. ఈ యేడు మూడు మాసాల్లో పట్టుకున్న గంజాయి జనవరి 48.86 కేజీలు కాగా, దీని విలువ రూ.12లక్షల 22వేలు. ఫిబ్రవరి, మార్చి మాసాల్లో 17.5కేజీల గంజాయి పట్టుకోగా దీని విలువ రూ.4లక్షల 38వేలుంటుంది. ఈ లెక్కలు గమనిస్తే నగరంలో గంజాయి దందా ఏదేచ్ఛగా సాగుతున్నట్లు స్పష్టమవుతుంది.

పోలీసులు పట్టుకున్న గంజాయి (ఫైల్)



విద్యార్థులే లక్ష్యంగా..

వరంగల్ నగరంలోని యువత మత్తులో మునిగిపోతున్నారు. వందల కిలోల గంజాయి నగరానికి చేరుతుండటం గమనిస్తే యువత ఏ మేరకు దీనికి బానిసలయ్యారో తెలుస్తోంది. నగరానికి వస్తున్న గంజాయిని పొడి చేసి సిగరెట్లు, చాక్లెట్ల రూపేణా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. కేజీ గంజాయి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుందని తెలిసింది. దళారులు 10గ్రాములు, 20గ్రాముల చొప్పుల ప్యాకెట్స్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారం. 10గ్రాముల ప్యాకెట్ రూ.100 నుంచి రూ.200 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఒక సిగరెట్ గంజాయి దమ్ము లాగిస్తే ఆరు బీర్లు తాగినంత నిషా వస్తుందని వైద్యులు చెబుచున్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ నిషాను యువత పొందుతున్నారు. ప్రముఖ విద్యా సంస్థల్లో విద్యనభ్యసించే యువత గంజాయి మత్తుకు బానిసలవుతున్నట్లు తెలిసింది. కరీంనగర్ రహదారి వెంట ఉన్న పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలిసింది. రింగ్‌రోడ్డు పరిసరాల్లో విద్యార్థులు గంజాయిని సేవిస్తే పట్టుబడుతుండగా వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపుతున్నట్లు సమాచారం. ఇటీవల ఒక పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురు విద్యార్థులు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు తెలిసింది. సంపన్నుల పిల్లలుగా గుర్తించి హెచ్చరించి పంపినట్లు తెలిసింది. ఇలా నగర కళాశాలల్లో ఈ దందా భారీగానే సాగుచున్నట్లు అధికారిక సమాచారం.

సోమనర్సయ్యకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం పరిశోధకుడు సముద్రాల సోమనర్సయ్యకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు ఆదివారం కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి తెలిపారు. 'అన్ అనాలసిస్ ఆన్ ఆంత్రోపోమెట్రిక్ మేనేజ్‌మెంట్ అండ్ ఫిజికల్ కాంపోనెంట్స్ ఎమాంగ్ జూనియర్ వాలీబాల్ ప్లేయర్స్ ఇన్ రిలేషన్ టు దెయిర్ పెర్మార్మెన్స్'అనే అంశంపై వరంగల్ కిట్స్ కళాశాల ప్రొఫెసర్ పి. రమేశ్‌రెడ్డి పర్యవేక్షణలో సోమనర్సయ్య డాక్టరేట్ పూర్తి చేశారు. జనగామ జిల్లా జఫర్‌ఘడ్ మండలానికి చెందిన సోమనర్సయ్యను కేయూ ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.రామనాథ్‌కిషన్, బీవోఎస్ ఛైర్మన్ ప్రొఫెసర్ రవికుమార్, కేయూ ఫిజికల్‌ఎడ్యుకేషన్ విభాగాధిపతి ఏటీబీటీ ప్రసాద్ అభినందించారు.

విచక్షణ కోల్పోకు.. విధిరాతను చెరపనీకు..



- పరీక్షల సమయాల్లో ఒత్తిడికి గురికావొద్దు
- ఇష్టపడి చదివితే అంతా సులభమే..
- విద్యార్థులూ.. ఆత్మన్యూనత భావాన్ని విడనాడాలి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17 : తీవ్రమైన పోటీ ప్రపంచంలో విద్యార్థులు మనోధైర్యాన్ని కోల్పోతూ మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. క్షణికావేశంలో బలవన్మరణాల పాలవుతున్నారు. పరీక్షల సమయాల్లో తీవ్ర మనోవేదనకు గురువుతున్న కొంతమంది విద్యార్థులు.. విచక్షణను కోల్పోతూ వారి తలరాతను వారే చెరిపేసుకుంటున్నారు. విద్యార్థులెప్పుడు ఇష్టపడి చదివితే సంక్లిష్టమైన సందర్భాలు కష్టపడకుండానే దాటేయవచ్చునని విద్యారంగ నిపుణులు, మనోవికాస నిపుణులు చెబుతున్నారు. మార్కులే పరమావధిగా కాకుండా విజ్ఞానం కోసం మాత్రమే చదువుతున్నామనే జిజ్ఞాసను విద్యార్థులు అలవర్చుకోవాలని వారు సూచిస్తున్నారు. విజయావకాశాలకు దారులు వెతుక్కుంటూ ముందుకు సాగాలని వారు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై అనవసరపు భారాలను మోపవద్దని వారు హెచ్చరిస్తున్నారు. సానుకూల దృక్పథంతో చదువుకునే వాతావరణంలోకి విద్యార్థులను తీసుకొని రావాలని హితబోధ చేస్తున్నారు. ఇంటర్ విద్యార్థిని సాహిత్య మృతి, గతంలోనూ అనేక మంది విద్యార్థులు మార్కులు బాగా రాలేదని, పాస్ కాలేదని ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉమ్మడి జిల్లాలో అనేకం ఉన్నాయి. ఇంటర్ పరీక్షలతో పాటు సీబీఎస్ఈ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పదో తరగతి పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు మానసిక స్థైర్యాన్ని కోల్పోవద్దని 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఒత్తిడికి లోనుకావొద్దు.. మనోధైర్యాన్ని కోల్పోవద్దు..

విద్యార్థులెప్పుడు వారి సామర్థ్యాల మేరకు లక్ష్యాలను నిర్దేశించుకొని ముందుకు చదువుకోవాలి. ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంలో మందుకు సాగాలని విద్యారంగ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థులు వారి లక్ష్యాలను ఎంచుకునే ముందుగానే అందుకు తగిన శ్రమ, ప్రయాసలను బేరీజు వేసుకొని అందుకు అనుగుణంగా వారి మానసిక పరిస్థితిని సిద్ధం చేసుకోవాలని వారు చెబుతున్నారు. పరీక్షలంటే విద్యార్థుల ప్రతిభా పాటవాలను ప్రదర్శించుకునే వేదికలుగా గుర్తించాలి. గెలుపోటములను సరిసమానంగా తీసుకునే మనోసిద్ధిని కలిగి ఉండాలని వారు సూచిస్తున్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాలను దరిచేరకపోతే ప్రత్యామ్నాయ లక్ష్యాల వైపు దూసుకెళ్లాలే తప్ప ప్రాణపరిహారం చేసుకోవద్దని నిపుణులు చెబుతున్నారు. ఏదైనా సందర్భంలో ఒత్తిడికి లోనైతే ఆ విషయాలను స్నేహితులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకొని ఊరట చెందాలంటున్నారు.

భారాలను మోపొద్దు.. తీరాలకు చేర్చొద్దు..

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులపై తీవ్రమైన భారాన్ని మోపొద్దని మనోవికాస నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థుల సామర్థ్యాల మేరకు, వారికి ఇష్టమైన కోర్సుల్లో మాత్రమే చేర్పాలని చెబుతున్నారు. తల్లిదండ్రుల కోరికలను వారి పిల్లలపై రుద్దుతూ వారి మనోనిబ్బరాన్ని కోల్పోయేలా చేసే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పద్ధతులు మార్చుకోవాలని వారు హెచ్చరిస్తున్నారు. విద్యార్థుల మేధస్సును ఇతరులతో ఎప్పుడూ పోల్చవద్దని సూచిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేధస్సును వెలికి తీస్తూ వారి ఇష్టాల మేరకు విద్యాబుద్ధులు చెప్పించాలే తప్ప తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వారిని ఇబ్బందులకు గురిచేయొద్దని చెబుతున్నారు. విద్యార్థులను విమర్శించకుండా వారిని సక్రమమైన దారుల్లో పెట్టేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలంటున్నారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా, ప్రేమ పూర్వకంగా మెలగుతూనే వారిలో లక్ష్యాలను చేరుకునే తృష్ణను రగించాలని సూచిస్తున్నారు. జీవితంలో విఫలమమై విజయాలు సాధించిన వారి వివరాలను విద్యార్థులకు కథలుగా చెప్పాల్సిన ఆవశ్యకత ఉందంటున్నారు. విద్యార్థుల్లో ఉండే ఆత్మన్యూనత భావాలను తొలగించేందుకు నిష్ణాతులతో అవగాహన కల్పించాలని అభిప్రాయపడుతున్నారు.

సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి

డాక్టర్ బరుపాటి గోపి, మనోవికాస నిపుణుడు



విద్యార్థులందరూ ప్రతికూల పరిస్థితుల్లోనూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలి. తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపాలి. ఎప్పటికప్పుడు వారి సామర్థ్యాలను అంచనా వేస్తూ సానుకూల వాతావరణంలో చదువుకునేలా వారిలో ఒత్తిడిని దూరంచేయాలి. మార్కులకు బదులుగా విద్యార్థులకు విజయావకాశాలకు దారులను చూపేందుకు కృషి చేయాలి.

దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫీజు గడువు 4

కేయూ క్యాంపస్, మార్చి 17: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం అందిస్తున్న డిగ్రీ మొదటి, రెండో, మూడో ఏడాది బీఏ, బీకాం, జనరల్, కంప్యూటర్, బీబీఏ, బీఎస్సీ కోర్సుల్లో 2022-2023 వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు మళ్లీ పరీక్షల కోసం తమ ఫీజులను ఏప్రిల్ 4వ వరకు ఎలాంటి అపరాధరుసుం లేకుండా చెల్లించుకోవాలని కేయూ దూరవిద్యకేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో, మూడో ఏడాది పరీక్షలు రాసిన విద్యార్థులు ఫెయిలైన సబ్జెక్టులకు, అలాగే ఇంప్రూవ్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు తమ ఫీజులను చెల్లించుకోవాలని తెలిపారు. అన్ని పేపర్లకు రూ.600, రెండు పేపర్లకు రూ.500, ఇంప్రూవ్‌మెంట్ ఒక్కో పేపర్‌కు రూ.300 చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఫీజు చెల్లించిన చలనా, ఫొటో, ఫెయిలైనమెమో జతచేసి దూరవిద్యకేంద్రంలో అందచేయాలన్నారు.

పల్లెపాడు దామోదర్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



డాక్టర్ పల్లెపాడు దామోదర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ జంక్షన్, మార్చి 17: వినియోగదారుల ఉద్యమంలో సామాజిక సేవ కార్యక్రమాలు 30ఏళ్లు పని చేస్తున్న డాక్టర్ పల్లెపాడు దామోదర్‌కు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. 17వ తేదీన చెన్నైలో జరిగిన నేషనల్ కన్వెన్షన్‌లో ఛైర్మన్ అనంత్‌శర్మ చేతులమీదుగా మెడల్ అందుకున్నారు. డాక్టర్ పల్లెపాడు దామోదర్ మూడు దశాబ్దాలుగా వినియోగదారులను చైతన్యపరిచే కార్యక్రమంలో భాగంగా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా తూనికలు, కొలతలు జరిగే మోసాలపై, బంగారం కొనుగోలులో హాల్‌మార్క్, బీఐఎస్ ప్రాముఖ్యతపై, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ యాక్ట్‌పై ప్రభుత్వ శాఖల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వినియోగదారులకు పటిష్టమైన రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన 2019 వినియోగదారుల చట్టం అమలు కోసం దక్షిణాది రాష్ట్రాలలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కృషికి గాను జాతీయస్థాయి గుర్తింపు లభించింది. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రీతిపాండే, ప్రెసిడెంట్ అరుణ్ కుమార్, సీసీఐ జనరల్ సెక్రటరీ సాంబరాజు చక్రపాణి, సీసీఐ తెలంగాణ ప్రెసిడెంట్ ఎం.సుదర్శన్, వినియోగదారుల జాతీయ కన్వెన్షన్ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే



రుద్రేశ్వరాలయంలో జస్టిస్ అరాధేతోపాటు ఇతర న్యాయమూర్తులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల గుడిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే సతీసమేతంగా సందర్శించారు. రుద్రేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వర్తింపచేశారు. జస్టిస్ ఆరాధే వెంట హైకోర్టు జడ్జి జస్టిస్ టి.వినోద్‌కుమార్, జిల్లా పోర్టుపోలియో జడ్జి, తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ జె.లక్ష్మణ్, హైకోర్టు జడ్జి జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు, హైకోర్టు రిజిస్ట్రార్ నర్సింగరావు, శ్రీనివాసరెడ్డి, వరంగల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కోక రాధాదేవి, హనుమకొండ జిల్లా కోర్టు జడ్జి ఎం.క్రిష్ణమూర్తి వేయిస్తంభాల గుడికి విచ్చేశారు. వీరికి అలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ, వేదపండితుడు గంగు మణికంఠ శర్మ పూర్ణకుంభంతోస్వాగతం పలికారు. మంగళవాయిద్యాలతో ఆలయంలోకి తోడ్కొని వెళ్లారు. అనంతరం ఆలయ నాట్య మండపంలో తీర్థ ప్రసాదాలను, స్వామి వారి శేష వస్త్రాలను అందచేశారు. వేద ఆశీర్వచనం చేశారు.

వరంగల్ ఇంటాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆ తర్వాత పునరుద్ధరించి కల్యాణ మండపాన్ని తిలకించారు. జస్టిస్ ఆరాధే సందర్శకుల డైరీలో వేయిస్తంభాల గుడిని ఒక అద్భుతమైన కట్టడంగా అభివర్ణించారు. కాకతీయులు కళా రాధకులని, 800 యేళ్ల కిందట నిర్మించిన ఇలాంటి దేవాలయం ఈతరం వారు కూడా తరించడం గొప్ప అదృష్టమని, ఆలయాన్ని సందర్శించడం తనకు గొప్ప అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈవో వెంకటయ్య, అర్చకుడు ప్రణవ్, కేంద్ర పురావస్తు శాఖ కోఆర్డినేటర్ నిరంజన్ దేవాదాయ శాఖ సిబ్బంది ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 17: రాష్ట్రంలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. హనుమకొండలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా నాగిరెడ్డి మాట్లాడుతూ... ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న తరుణంలో పెండింగ్ బిల్లులను చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వం డీఏలను మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. 10వ తరగతి పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు సరైన మౌలిక వసతులతో పాటు మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ సిబ్బందికి కనీస వసుతుల ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. ఈనెల నుంచి ఉద్యోగ విరమణలున్నాయని, ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన గ్రాట్యుటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ తదితర బెనిఫిట్లను సత్వరమే చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ముత్యాల రఘుపతి, గొడిశాల సత్యనారాయణ, నాయకులు బిల్ల సుబ్బారావు, రమేష్, లక్ష్మయ్య, కుమారస్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి స్త్రీవాద రచయిత చలమే..

- అన్నింట్లో స్త్రీ, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలి
- డాక్టర్ అంపశయ్య నవీన్.. ఐదు గ్రంథాల ఆవిష్కరణ
- ఘనంగా రుద్రమ ప్రచురణల దశాబ్ది వేడుకలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ అంపశయ్య నవీన్

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహిత్యంలో మొదటి స్త్రీవాద రచయిత చలమేనని, అన్ని విషయాలలో స్త్రీలు, పురుషులు సమానమన్న అభిప్రాయం కలగాలని ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. రుద్రమ ప్రచురణల దశమ వార్షిక సమావేశాలలో భాగంగా ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమిక పాఠశాలలో ఓరుగల్లు రచయిత్రుల ఐదు గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈఐదు గ్రంథాల ఆవిష్కరణలను ఐదు సమావేశాలుగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనిశెట్టి రజిత, కొమ్రరాజు రామలక్ష్మి నిర్వాహకులుగా వ్యవహరించారు. మొదటి సమావేశంలో చిమమండ న్గోజి అడిచే గ్రంథాన్ని డాక్టర్ అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ ఇలాంటి పుస్తకాలు చదివితే స్త్రీల విషయంలో అభిప్రాయాలు మారుతాయని అన్నారు. పుస్తకాన్ని మెట్టు రవీందర్ పరిచయం చేశారు. రెండో సమావేశంలో తమ్మెర రాధిక హవేలీ దొరసాని కథా సంపుటిని బీవీఎస్ స్వామి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. రాధిక కథలో ప్రత్యేకత కనిపిస్తుందని, విభిన్న వస్తువులతో వాస్తవిక దృక్పథం ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని మాలతీలత పరిచయం చేశారు. మూడో సమావేశంలో భారత దేశంలో వితంతు వ్యవస్థ అనే గ్రంథాన్ని ఆవిష్కరించిన తిరునగరి దేవకీదేవి దేశంలోని వితంతు దుర్భర పరిస్థితులను వివరించారు. తెన్నేటి విజయచంద్ర పుస్తకాన్ని పరిచయం చేశారు. నాలుగో సమావేశంలో తమ్మెర రాధిక మరొక గ్రంథం కాలం జాడలు తీస్తూ.. కవితా సంపుటిని ఆవిష్కరించిన పొట్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాధిక కవిత్వంలో మానవ సంబంధాల ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. పుస్తకాన్ని చంద్రకళ పరిచయం చేశారు. ఐదో సమావేశంలో అని శెట్టి రజిత కాలం కాన్వాస్ మీద కతా సంపుటిని ఆవిష్కరించిన వీఆర్ విద్యార్థి మాట్లాడుతూ.. అనిశెట్టి రజిత కాన్వాస్ పెద్దదని, ఆమె కవిత్వంలో వస్తు వైవిధ్యం తాత్వికత ఉంటుందన్నారు. ఈపుస్తకాన్ని సింగరాజు రమాదేవి పరిచయం చేశారు.

ఈ సమావేశంలో నాగిల్ల రామశాస్త్రి, డి.ధర్మయ్య, నిధి, పల్లె శ్రీను, బి.రమాదేవి, వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, పల్లేరువీరాస్వామి, బిల్ల మహేందర్, నేరేళ్ల శ్రీనివాస్ సౌహార్ద్ర సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కొమ్రరాజు రామలక్ష్మి ముగింపు వ్యాక్యాలు పలికిన ఈ సమావేశాలలో కవులు, రచయితలు, సాహితీ వేత్తలు, కళాకారులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గొర్రెలకాపరిని కాటేసిన పాము

- పామును సంచిలో వేసుకుని ఆస్పత్రులకు పరుగులు
- అది ఏ పామో తెలియక చికిత్స చేయని వైద్యులు



సంచిలో పామును వేసుకుని ఎంజీఎం ఆస్పత్రికి వచ్చిన రాజెల్లు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 : పాము కాటుకు గురైన గొర్ల కాపరి కాటేసిన పామును తీసుకుని వైద్యం కోసం ఆస్పత్రుల చుట్టూ తిరగ్గా, అది ఏ పామె తెలియక వైద్యం చేయని ఉదంతం వరంగల్ జిల్లాలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుడు నక్క రాజెల్లు కథనం ప్రకారం... వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని బండౌతపురం గ్రామానికి చెందిన గొర్ల కాపరి నక్క రాజెల్లు రోజులాగే చెరువులో గొర్లను కాస్తున్నాడు. ఎంత ఎక్కువగా ఉండడంతో ఓ చెట్టు కింద సేద పడుకున్నాడు. చెట్టుపై నుంచి గుర్తు తెలియని పాము కింద పడింది. పామును గమనించిన ఓ గొర్రె దానిపై దాడి చేయడంలో పాము గొర్లకాపరి చేతిపై కాటు వేసింది. దీంతో అతడు పామును చంపి, దానిని ఓ సంచిలో వేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి వైద్యం కోసం వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చాడు. వైద్యులు ఓ ఇంజక్షన్ వేసి గ్లూకోజ్ పెట్టి, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడి నుంచి పామును తీసుకుని ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నాడు. పామును గమనించిన వైద్యులు అది రక్తపింజర, కొండచిలువ అనేది తేల్చలేకపోతున్నామని, సరైన వైద్యం చేయలేమని వైద్యులు తేల్చారు. ఏం చేయాలో తెలియక, బంధువుల సూచన మేరకు రాయపర్తి మండలంలోని కొండాపురం గ్రామానికి వెళ్లి నాటు వైద్యం చేసుకున్నాడు. అనంతరం ఇంటికి చేరుకున్నాడు. కాటు వేసిన చోటచేయి వాపు వచ్చింది. ప్రస్తుతం రాజెల్లు ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఆకట్టుకున్న బ్రైడల్ ఫ్యాషన్ షో

- విదేశీయులను ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు



బ్రైడల్ ఫ్యాషన్ షోలో భారతీయ మహిళలు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి):అమెరికా కెంటకీలోని లూయిస్‌విల్లేలో శనివారం రాత్రి స్పీడ్ ఆర్ట్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవాస భారతీయుల సాంస్కృతిక ప్రదర్శనలు విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సాన్ డీగో మ్యూజియం ఆఫ్ ఆర్ట్ సేకరించిన భారత్‌తో సహా దక్షిణాసియా దేశాలకు చెందిన అత్యంత ప్రాచీనమైన చిత్ర కళాఖండాల గురించి ఆమెరికాలోని చిత్ర కళాభి మానులకు, మ్యూజియం సందర్శకులకు అవగాహన కలిగించడానికి చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్పీడ్ ఆర్ట్ మ్యూజియం హాల్‌లో లూయిస్‌విల్లేలోని ప్రవాస భారతీయులతో ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో 50 మందికిపైగా ప్రవాస భారతీయులు వారి కుటుంబసభ్యులు పాల్గొని సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ప్రధానంగా ప్రవాస భారతీయ మహిళల వధువుల వేషధారణ (బ్రైడల్ షో) విశేషంగా ఆకట్టుకున్నది. భారత దేశంలోని ఆయా రాష్ట్రాల్లో వివాహాల సందర్భంగా ఆ రాష్ట్రాల సంప్రదాయాల ప్రకారం వధువులను అలంకరించే తీరు, వారి వస్త్రధారణ, నగల గురించి తెలియ చేసేఈ ప్రదర్శన ఆద్యంతం విదేశీయులను విశేషంగా ఆకట్టుకున్నది. ఒక్కో రాష్ట్రం నుంచి ఒక్కో వధువు ఆ రాష్ట్రం సంస్కృతి, సంప్రదాయం ప్రతిబింబించేలా అందంగా అలంకరించుకొని వేదికపై నిర్వహించిన క్యాట్ వాక్, మేడ్ ఇన్ ఇండియా పాట నేపథ్యంగా ఇచ్చిన ఈ ప్రదర్శన అబ్బురపరిచింది. అనంతరం సమర్పణ్ నృత్య పాఠశాల ప్రవాస భారతీయ పిల్లలు నిర్వహించిన నృత్య ప్రదర్శన కూడా విశేషంగా ఆకట్టుకున్నది. బ్రైడల్ షోకు లక్ష్మి, దీప్తి కొరియోగ్రాఫర్లుగా వ్యవహరించారు.

పదవులపై పెదవి విరుపు

(5వ పేజీ తరువాయి)

ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోటాలోకి వెళుతుందని అంటున్నారు.

సీనియర్లు, కీలక నేతలకు ఝలక్

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లు, ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించిన నేతలకు నామినేటెడ్ పోస్టుల్లో అన్యాయం జరిగిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా పాలకుర్తి కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి నామినేటెడ్ పోస్టుపై ఆశలు పెట్టుకున్నారు. అలాగే సీనియర్ నేత బొద్దిరెడ్డి ప్రకాశ్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, గత ఎన్నికల్లో వర్ధన్నపేట సీటును త్యాగం చేసిన నమిండ్ల శ్రీనివాస్‌తో అనేక మంది సీనియర్లకు నామినేటెడ్ పదవులు వరించకపోవటంపై కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. మరో మహిళ నేత కె.రవళిరెడ్డికి కూడా కీలకమైన పోస్టు దక్కుతుందని భావించినప్పటికీ నిరాశే మిగిలింది. అలాగే భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెలిశాలకు చెందిన మాజీ మావోయిస్టు నేత గాజర్ల అశోక్‌కు కూడా నామినేటెడ్ పోస్టు దక్కకపోవడం ఆయన వర్గీయుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అలాగే మంత్రి కొండా సురేఖ ప్రాతినిథ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి నామినేటెడ్ పదవి ఒక్కరికి కూడా దక్కలేదు. మీసాల ప్రకాష్, నల్లొండ రమేష్, గోపాల నవీన్‌రాజ్ తదితర నేతలు నామినేటెడ్ పోస్టులు వస్తాయనే ఆశతో ఉన్నారు. అలాగే మరో మంత్రి సీతక్క ప్రాతినిథ్యం వహిస్తున్న ములుగు నుంచి కూడా ఒక్కరికి నామినేటెడ్ పోస్టులు దక్కలేదు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గొల్లపల్లి రాజేందర్ తదితర నేతలకు నామినేటెడ్ పదవులు వరిస్తాయని క్యాడర్ భావించినప్పటికీ నిరాశే మిగిలింది. నర్సంపేట, డోర్నకల్, భూపాలపల్లి నియోకవర్గాల నుంచి కూడా ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కకపోవటంతో కేడర్‌లో కొంత అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యేలు లేని చోట కూడా..

అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌పార్టీ ఓడిపోయింది. ప్రభుత్వ కార్యక్రమాల్లో పార్టీ ప్రతినిధులు లేకుండా పోవటంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆందోళన చెందుతున్నారు. దీంతో జనగామ నుంచి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, స్టేషన్‌ఘనపూర్ నుంచి శనిగపురం ఇందిరకు నామినేటెడ్ పోస్టులు దక్కుతాయని ఆశించారు. అయితే వీరికి గానీ, వారి అనుచరులకు కానీ నామినేటెడ్ పదవులు దక్కకపోవటంపై నేతలు నారాజ్ అవుతున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం ఇందిర తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కోణంలో ఇందిరకు ఇవ్వకపోయినప్పటికీ ఇదే నియోజకవర్గానికి చెందిన మరో నేతకు నామినేటెడ్ పోస్టు ఇస్తే ప్రొటోకాల్ ప్రకారం అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఇక జిల్లాస్థాయి పదవులే..

రాష్ట్రస్థాయిలో కీలక నామినేటెడ్ పోస్టులు దాదాపు పూర్తి చేశారు. మిగిలిన కొన్ని పోస్టులకు రాష్ట్రస్థాయిలో పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక జిల్లాస్థాయి నామినేటెడ్ పోస్టులపైన నేతలు ఆశలు పెట్టుకుంటున్నారు. మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు, గ్రంథాలయ చైర్మన్‌లాంటి పదవులపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించాల్సి ఉంది. వీటితో పాటు కార్పొరేషన్‌లకు రాష్ట్ర స్థాయి డైరెక్టర్ పదవులు కూడా ఉండటంతో వాటిలో ఏదో ఒకటి రాకపోతుందా? అనే ఆశతో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటూ పార్టీని కాపాడుకుంటూ వస్తున్నవారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలని కాంగ్రెస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు.

పక్కాగా ఏర్పాట్లు

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు ● సర్వం సిద్ధం చేసిన అధికారులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 17: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ఈ నెల 18 నుంచి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వీక్లి టెస్టులు, మంత్లీ టెస్టులు, రౌండ్ టెస్టులతో పాటు ఈ సారి కొత్తగా ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో పూర్తి సిలబస్‌తో ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఇంటర్నల్స్ పూర్తి చేసి ప్రీఫైనల్ పరీక్షలు ముగించారు. పరీక్షల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తి చేసి పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశారు. పరీక్షల నిర్వహణకు 41 పరీక్షా కేంద్రాలతో పాటు ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఒక పరీక్షా కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ఇందులో జనగామ నియోజకవర్గ పరిధిలో 15, పాలకుర్తి నియోజకవర్గ పరిధిలో 9, ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో 17 కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలో మొత్తం 6,698 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుండగా వారిలో బాలికలు 3,560, బాలురు 3,138 మంది ఉన్నారు.

టైంటేబుల్ ఇలా ...

ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. ఈ నెల 18న తెలుగు, 19న హిందీ, 21న ఇంగ్లీషు, 23న గణితము, 26న బయలాజికల్ సైన్స్, 28న ఫిజికల్ సైన్స్ 30న సోషల్ స్టడీస్ పరీక్షలు జరుగనుండగా మిగతా రెండు ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు.

సిబ్బంది నియామకం ..

పరీక్షల నిర్వహణకు 41 కేంద్రాలలో 41 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 42 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 41 మంది సిట్టింగ్ స్క్వాడ్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 397 మంది ఇన్విజిలేటర్లు, 82 మంది అటెండర్లు, 82 మంది వాటర్ మెన్‌లు, ప్రతీ పరీక్షా కేంద్రంలో వైద్య సిబ్బందిని కేటాయించారు.

జిరాక్స్ కేంద్రాల మూసివేత ...

పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను, ఇంటర్నెట్ కేంద్రాలను మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రంలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదని సిబ్బందిని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ..

పరీక్షల సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ విధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నారు. విద్యార్థులు ఒక గంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకునేలా బస్సులు నడపాలని టీఎస్ ఆర్టీసీని ఆదేశించారు. సీసీ కెమెరాల ముందు ప్రశ్నాపత్రాలు తెరిచేలా ఆదేశించారు. పరీక్ష పూర్తయిన తరువాత పేపర్లను ప్యాకింగ్ చేసి పోస్టాఫీసులో భద్రపరుస్తారు.

కంట్రోల్ రూం ఏర్పాటు ..

పదవ తరగతి విద్యార్థుల సందేహాల నివృత్తికి జిల్లా కేంద్రంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఏవైనా సందేహాలుంటే కంట్రోల్ రూం నంబరు 6304062768కు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలి

పరీక్ష కేంద్రాలకు చేరిన మెటీరియల్..

టెన్త్ పరీక్షలకు సంబంధించి మెటీరియల్ ఇప్పటికే పరీక్ష కేంద్రాలకు చేరింది. ప్రశ్నాపత్రాలు పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. విద్యార్థులకు ఒక్క నిమిషం నిబంధన లేదు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలని అధికారులు తెలిపారు. అదే విధంగా ఈ సారి సైన్స్‌లో రెండు పేపర్లు ఉంటాయి. పార్ట్-1 బయలాజికల్ సైన్స్, పార్ట్-2 ఫిజికల్ సైన్స్ పేపర్లకు పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయి. సేవలందించడానికి వైద్య సిబ్బంది కూడా ఉంటారని అధికారులు పేర్కొన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి..

కె.రాము, జిల్లావిద్యాశాఖాధికారి



విద్యార్థులు ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా పరీక్ష రాయాలి. పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలి. పరీక్షల విషయంలో తల్లిదండ్రులు పిల్లలను భయాందోళనకు గురి చేయకుండా వారిని మానసికంగా సిద్ధం చేసి కేంద్రానికి పంపాలి. విద్యార్థులు కూడా అనవసర భయాందోళనకు గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి.

రోడ్డే మార్కెట్!

శివునిపల్లిలో కూరగాయల దుకాణాలకు స్థలం కరువు

రోడ్డుపైనే నిర్వహిస్తున్న వ్యాపారులు

ఇబ్బందులు పడుతున్న వినియోగదారులు

మార్కెట్ ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 17: శివునిపల్లిలో కూరగాయల మార్కెట్ లేక అటు వ్యాపారులు ఇటు వినియోగదారులు ఇబ్బందిపడుతున్నారు. కనీసం స్థలం లేక మూడు, నాలుగు దశాబ్దాలుగా రైల్వే గేటు వద్ద నిత్యం రద్దీగా ఉండే చోట విక్రయిస్తున్నారు. ఈ రోడ్డు గుండా నిత్యం వాహనాలు పాలకుర్తి, జఫర్‌గఢ్ వైపు వెళుతుంటాయి. వ్యాపార, విద్యాకేంద్రం కావడంతో విపరీతమైన రద్దీ ఉంటుంది. 50 మీటర్లు పొడవున్న స్థలంలో 25 దుకాణాలు ఉన్నాయి. వీటిలో ఐదారుగురు కూరగాయల వ్యాపారులు, ముగ్గురు చికెన్ వ్యాపారులు, పండ్లు, పూలు, చేపల దుకాణాల వారు అడ్డాలను ఏర్పాటు చేసుకున్నారు. వీరు ఎంతోకాలంగా తాత్కాలికంగా రేకుల షెడ్లు నిర్మించుకుని దుకాణాలు నడిపించుకుంటున్నారు. వీరు కాకుండా ఇంకా 20, 30 మంది మహిళలు ఇంకో వైపు రోడ్డుపైనే గంపలు పెట్టుకుని ఎండలో కూర్చుని కూరగాయలు, చేపలు, పండ్లు, పూలు అమ్ముతున్నారు. శివునిపల్లిలో 20 ఏళ్ల క్రితమే కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు స్థల సేకరణ చేశారు. సరస్వతీ శిశు మందిర్ వద్ద సుమారు ఎకరం స్థలం ప్రభుత్వం కేటాయించింది. గ్రామ పంచాయతీకి కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని సూచించింది. ఎలాంటి మంజూరు పత్రాలు ఇవ్వక పోవడంతో అది కాస్తా అన్యాక్రాంతం అయిందని చెబుతున్నారు. మార్కెట్‌కు స్థలం లేక వ్యాపారులు ఇరుకైన రోడ్డుపైనే వ్యాపారాలు చేస్తున్నారు. మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే స్థలం కేటాయించడంతో పాటు నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కనీసం రైతు బజార్ నిర్మించాలని ఎంతో కాలంగా ప్రజలు ప్రభుత్వాలను కోరుతున్నా ఫలితం ఉండడంలేదు. సేకరించిన స్థలంపై సర్వే చేసి ప్రభుత్వం కూరగాయల మార్కెట్ నిర్మిస్తే అక్కడే కూరగాయలతో పాటు చికెన్, మటన్, చేపల మార్కెట్లు, ఇతర వస్తువులు కూడా ఒకే దగ్గర అమ్ముకునే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో కూడా కూరగాయల మార్కెట్ లేదు. బస్టాండ్ వెనక ఖాళీ స్థలంలో విక్రయిస్తున్నారు. ఇక చేపల విక్రయ దారులు పల్ల గుట్ట క్రాస్ రోడ్డులో హై వే పక్కన విక్రయాలు సాగిస్తున్నారు. చికెన్, మటన్ వ్యాపారులు రోడ్డు వెంబడి దుకాణాలు ఏర్పాటు చేసుకుని అద్దెలు చెల్లిస్తూ మనుగడ సాగిస్తున్నారు. కొంత కాలం క్రితం రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేయాలని ఘన్‌పూర్ గ్రామ పంచాయతీ వారు పరిశీలించారు. అది కూడా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. ఇక్కడ మార్కెట్ ఏర్పాటైతే స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి ఇరు పట్టణాల్లోని కూరగాయలు, చికెన్, చేపలు, మటన్, పూలు అమ్మే తదితర వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకునే అవకాశం లభిస్తుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



రోడ్డుపైనే చేపలు విక్రయిస్తున్న వ్యాపారి

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి..

చిలగాని రవి, కూరగాయల వ్యాపారి



ఎన్నో ఏళ్లుగా స్టేషన్ ఘన్‌పూర్‌లో కూరగాయలు అమ్ముతూ బతుకుతున్నాం. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పొట్టపోసుకుంటున్నాం. పైగా రోజూ కూరగాయలను ఇంటికి తీసుకు పోయి తీసుకుని రావాల్సి వస్తున్నది. దీంతో రవాణ ఖర్చులు వృథా అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి కూరగాయల మార్కెట్ నిర్మించాలి.

మార్కెట్ లేక ఇబ్బందులు పడుతున్నాం..

శ్రీనివాస్‌రెడ్డి, చికెన్ వ్యాపారి



ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో ఎక్కడా కూరగాయల మార్కెట్ లేదు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ కూరగాయలు, మటన్, చికెన్, చేపలు అమ్ముకునే దుస్థితి ఉంది. మార్కెట్ లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేస్తే ఆయా దుకాణాల వారందరూ ఒకే దగ్గర అమ్ముకునే అవకాశం ఉంటుంది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

పాలకుర్తి, మార్చి 17: ఆర్థిక ఇబ్బందులతో గాదరి సంజీవ(34) అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోతులబాదు గ్రామానికి చెందిన సంజీవ అప్పులు తెచ్చి ఇంటిని నిర్మించాడు. అయితే పంటలు సరిగా పండకపోవడంతో అప్పులు తీరే మార్గం లేక మనస్తాపంతో ఆదివారం సాయంత్రం వ్యవసాయ బావి వద్ద పురుగుల మందుతాగి చనిపోయాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై సాయిప్రసన్నకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

బచ్చన్నపేట, మార్చి 17: మండలంలోని కొన్నె గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మల్ల సాయిలు అంత్యక్రియలకు గ్రామ బీఆర్ఎస్ నాయకులు కోడూరు శివకుమార్‌గౌడ్ ఆదివారం రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనతో పాటు చంద్రయ్య, ఎంటే శ్రీనివాస్, సత్తయ్య, నాగులు, కొంరయ్య, మహేందర్, కిష్టయ్య తదితరులు నివాళి అర్పించారు.

తేనెటీగల దాడిలో రైతు మృతి



మృతిచెందిన నారాయణరెడ్డి

లింగాలఘణపురం, మార్చి 17: మండలంలోని కళ్లెం గ్రామానికి చెందిన పూంద్ర నారాయణరెడ్డి(67)అనే వృద్ధరైతు ఆదివారం తేనెటీగల దాడిలో మృతిచెందాడు. పొలం వద్ద కోతుల బెడదను నివారించేందుకు మధ్యాహ్నం ఇంటినుంచి బావి వద్దకు వెళ్లిన నారాయణరెడ్డిపై తేనెటీగలు దాడి చేశాయి. దీంతో కొద్దిసేపటి తర్వాత గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ నారాయణరెడ్డి మృతిచెందారు. నారాయణరెడ్డికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పండ్ల మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న వివేకానంద ట్రస్టు సభ్యులు

జనగామ కల్చరల్, మార్చి 17: వివేకానంద సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రధాన కార్యదర్శి దొంతుల శేఖర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణం కోసం మొక్కల పంపిణీ చేపట్టామన్నారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యత అని, లేని పక్షంలో రాబోయే రోజుల్లో ప్రమాదకర స్థితిలో మనుగడ ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో యాదగిరిరెడ్డి, గుగ్గిల్ల మహేష్, రవికుమార్, రాజు, బాలనర్సయ్య, సత్యనారాయణ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సోమన్న ఆలయానికి వెండి కలశం బహూకరణ



వెండి కలశం అందజేస్తున్న భక్తులు

పాలకుర్తి, మార్చి 17: శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి భక్తులు వెండి కలశాన్ని అందజేశారని ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. ఆదివారం ఆలయం అధికారులకు పాలకుర్తికి చెందిన పొన్నాల చంద్రకళ వీరయ్య కుటుంబసభ్యులు శోభన్, స్పందన, గణేష్, గీత, సతీష్, రమాదేవి తదితరులు స్వామివారికి రూ.40 వేలు విలువ గల వెండి కలశంను అందచేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటయ్య, శ్రీనివాస్, రాములు పాల్గొన్నారు.

కాలాతీత పండుగ .. రంజాన్

● ఏటా వెనక్కి జరగడం ప్రత్యేకత



జఫర్‌గడ్, మార్చి 17: ముస్లింల పవిత్రమైన పర్వదినమైన రంజాన్ కాలాతీత పండుగ. ఆంగ్ల క్యాలెండర్‌లో ఏడాదికి ఎన్ని నెలలు ఉంటాయో.. ఒక దశాబ్దంలో అన్ని నెలల్లోనూ రంజాన్ పండుగ రావొచ్చు. ఉదాహరణకు.. రంజాన్ మాసం గత ఏడాది మార్చి 24న ప్రారంభమైంది. అదే ఈ ఏడాది మార్చి 12న ప్రారంభం కావడంతో 12 రోజులు ముందుగా వచ్చింది. ఈ విధంగా చూసుకుంటే ఓసారి వేసవి కాలం, మరోసారి శీతాకాలం, ఒక్కోసారి వర్షాకాలంలో పండుగ వస్తూంటుంది. అలాగే హిందువులు ఘనంగా జరుపుకునే సంక్రాంతి జనవరిలో వస్తుంది. క్రైస్తవుల పండుగ క్రిస్మస్ డిసెంబరు 25నే ఉంటుంది. కానీ ముస్లింల పర్వదినాలైన రంజాన్, బక్రీద్ ఏ రోజు జరుపుకోవాలనే దానిపై సర్వత్రా ఉత్కంఠ. దీనికి ప్రధాన కారణం హిజ్రీ కాలమానినీ అనుసరించడమే.

రోజులు, సంఖ్యలో వ్యత్యాసం...

ఆంగ్ల క్యాలెండర్ అయినా.. ఇస్లామిక్ క్యాలెండర్ అయినా ఏడాదికి 12 నెలలే. కానీ ఈనెలల్లో ఉండే రోజుల సంఖ్యలో వ్యత్యాసం కనిపిస్తుంది. ఆంగ్ల క్యాలెండర్ ప్రకారం ఫిబ్రవరిలో మినహా కొన్ని నెలల్లో 30 రోజులు, మరికొన్ని నెలల్లో 31 రోజులు ఉంటాయి. ఇస్లామిక్‌లో కొన్ని నెలల్లో 29 రోజులు, మరికొన్ని నెలల్లో 30 రోజులు ఉంటాయి. ముస్లింలు ఇస్లామిక్ క్యాలెండర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నందున ఒక్క రంజాన్‌కే కాదు ఏ పండుగైనా వారు నెలవంక దర్శనంపైనే ఆధారపడి జరుపుకుంటారు.

నెలకు 29.5 రోజులే...

హిజ్రీ క్యాలెండర్ ప్రకారం అంతా చంద్రమాసం ఆధారితం. నెలవంకను బట్టి అమలవుతుంది. ఆంగ్ల క్యాలెండర్‌లో 365 రోజులు ఉంటే.. హిజ్రీలో సరాసరిన 354 రోజులు మాత్రమే ఉంటాయి. అంటే నెలకు 29.5 రోజులు అన్నమాట. రంజాన్‌ను ఆంగ్ల క్యాలెండర్‌తో బేరీజు వేసుకుంటే అన్ని కాలాల్లో కలుపుకుని 11 - 12 రోజులు ముందుకు జరుగుతూ ఉంటుంది.

హిజ్రీ కాలమానిని అంటే...

మహ్మద్ ప్రవక్త ఇస్లాం ప్రచారం కోసం మక్కా నుంచి మదీనాకు వెళ్లిన తరువాత కాలాన్ని హిజ్రీగా నామకరణం చేశారు. ఆ రోజు నుంచి హిజ్రత్ కాలమానిని ప్రారంభమైంది. కాలక్రమేణా హిజ్రత్ పిలుపు హిజ్రీగా రూపాంతరం చెందింది. ఈ కాలమానిని ప్రకారమే ముస్లింలు పర్వదినాలు జరుపుకుంటారు. హిజ్రీ కాలమానిని మొహర్రం మాసంతో మొదలై.. జిల్‌హజ్జా మాసంతో ముగుస్తుంది.

హిజ్రీ కాలమానిని నెలలు...

మొహర్రం, సఫరుల్, రబీఉల్ అవ్వల్, రబీఉల్ అఖీర్ (రబీఉస్‌సానీ), జమాదిల్ అవ్వల్, జమాదిల్ ఉస్సాని, రజ్జబ్, షాబాన్, రంజాన్, షవ్వాల్, జుల్‌ఖాదా, ఝుల్ హిజ్జా.



కూనూరు హైస్కూల్ 1977-78 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం



శివునిపల్లి పాఠశాల 1991-92 టెన్త్ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం

అ'పూర్వ' సమ్మేళనం

జఫర్‌గడ్, మార్చి 17: మండలంలోని కూనూరు జడ్పీ హైస్కూల్ 1977-78 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 46 ఏళ్ల తరువాత నాటి మిత్రులంతా ఒక్కచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, పరస్పర కుశల ప్రశ్నలతో సందడి చేశారు. క్రమశిక్షణతో విద్య నేర్పిన నాటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. చనిపోయిన మిత్రులను స్మరించుకుని నివాళులు అర్పించారు. భవిష్యత్తులో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో చిలువేరు రవిందర్, నాగార్జున ప్రసాద్, తోట భాస్కర్, పద్మ, పిచ్చిరెడ్డి, బొద్దున వెంకటేశ్వర్లు, బద్రీనాథ్, కాశీ విశ్వనాథ్, రాజేంద్రప్రసాద్, రమేశ్, మనోహర్, కేశవరెడ్డి, యుగంధర్‌రెడ్డి, వెంకట్రాంరావు, మల్లయ్య, ఉస్మాన్‌ఖాన్ పాల్గొన్నారు.

శివునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1991-92 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు 32 ఏళ్ల తరువాత వారికి ఓనమాలు నేర్పిన చదువులమ్మ నీడలో కలుసుకుని సంతోషంగా గడిపారు. ఒకరినొకరు కలుసుకొని ఆత్మీయ ఆలింగనం చేసుకొని మురిసిపోయారు. 32ఏళ్ల క్రితం చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకొని సంతోషంలో మునిగి తేలారు. కార్యక్రమంలో తాటికాయల కరుణాకర్, బోనగిరి విద్యాసాగర్, చిలువేరు రామకృష్ణ, ఆనందం, గట్టు మనోహర్‌గౌడ్, తోట సత్యం, శ్రీధర్ రాజు, మంచన హరీష్, యాదగిరి, ఉప్పలయ్య, రత్నాకర్ రెడ్డి, రజిత, సంతోష, లక్ష్మి, లలిత, మల్లం లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు ఏర్పాటు కలేనా?

- కొత్తపల్లి క్రాస్ నుంచి నర్మెట వరకు సింగిల్ రోడ్డుతో ఇబ్బందులు
- గతంలో హామీలు ఇచ్చి మరిచిన ప్రజాప్రతినిధులు
- పదేళ్లుగా ఎదురుచూస్తున్న రెండు మండలాల ప్రజలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 17: డివిజన్ కేంద్రంలోని కొత్తపల్లి క్రాస్ రోడ్డు నుంచి నర్మెట వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలనే ఆలోచన కలగానే మిగిలిపోతోంది. ఈ విషయంలో గతంలో అనేక మార్లు నాయకులు ఇచ్చిన మాటలు నీటి మూటలుగానే మారుతున్నాయి. కొత్తపల్లి క్రాస్ రోడ్డు నుంచి దేవాదుల కట్ట మీదుగా కొత్తపల్లి, తాటికొండ, జిట్టెగూడెం, మల్లన్నగండి రిజర్వాయర్ మీదుగా నర్మెటను కలుపుతూ సుమారు 30 కిలోమీటర్ల సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డు చేస్తామని అనేక మార్లు నేతలు చెప్పుకొచ్చారు కాని ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు.

మల్లన్నగండి రిజర్వాయర్‌తో రద్దీగా మారిన రోడ్డు..

ఘన్‌పూర్ నుంచి కొత్తపల్లి, తాటికొండ గ్రామాలకు ప్రజలు వెళ్లే సౌకర్యార్థం దేవాదుల రిజర్వాయర్ పైన ఏర్పాటు చేసిన కట్టరోడ్డు ప్రమాదకరంగా ఉంది. కట్టరోడ్డు పైన ఇరువైపుల రెయిలింగ్ లేకపోవడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. కొన్ని రోజుల క్రితం కట్ట పైన ఎదురుగా లారీ వచ్చిన లారీని తప్పించుకునే క్రమంలో ఆటో రిజర్వాయర్‌లో పడిపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. అదేవిధంగా మల్లన్నగండి రిజర్వాయర్ చుట్టూరా ప్రకృతి అందాలను తిలకించడానికి నిత్యం వందలాది మంది వస్తుంటారు. దీంతో రోడ్డు రద్దీగా మారింది. రోడ్డును విస్తరిస్తే మల్లన్నగండి వద్దకు వచ్చే పర్యాటకుల తాకిడి పెరుగుతుంది.

రోడ్డు విస్తరణతో ప్రయోజనాలు...

ఘన్‌పూర్ నుంచి నర్మెట వరకు సుమారు 30 కిలోమీటర్ల రోడ్డును విస్తరిస్తే నర్మెటకు వెళ్లే ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది, పాలకుర్తి, వర్ధన్నపేట, హన్మకొండ, తదితర ప్రాంతాలకు చెందిన వారు నర్మెట వెళ్లడానికి సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం నర్మెట తదితర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు జనగామ, లేదా చిలుపూరు మండలంలోని చిన్నపెండ్యాల గ్రామం మీదుగా వెళ్లతు న్నారు. రోడ్డును విస్తరిస్తే మల్లన్నగండికి వచ్చే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. ప్రతీ రెండేళ్లకోమారు తాటికొండ -జిట్టెగూడెం గ్రామాల పరిధిలో జరిగే మల్లన్నగండి సమ్మక్క -సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు మేలుగా ఉంటుంది.

ఎవరూ పట్టించుకోవడం లేదు..

మారబోయిన దశరథ్, బీఆర్ఎస్ నాయకుడు, కొత్తపల్లి



దేవాదుల రిజర్వాయర్ కట్టపై రెయిలింగ్ ఏర్పాటు చేయకపోవడం ప్రమాదకరమని తెలిసినప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు స్పందించడం సరికాదు. వెంటనే రెయిలింగ్‌తో పాటు కట్ట పైన స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేయాలి.



దెబ్బతిన్న కొత్తపల్లి-తాటికొండ రోడ్డు



రిజర్వాయర్ కట్టమీద రెయిలింగ్ లేకుండా ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

సింగల్ రోడ్డుతో అవస్థలు పడుతున్నాం..

వక్కల రాజు, బీఆర్ఎస్ నేత, తాటికొండ



ఘన్‌పూర్- నర్మెట రోడ్డు దెబ్బతినడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి వేళలో రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే చుక్కలు కనబడుతున్నాయి. ఎక్కడ పడిపోతామో అనే భయం వెంటాడుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.